


ఇండియన్ రెడ్‌క్రాస్‌కు ఐటిడిఎ పిఒ రూ.25 వేల విరాళం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ రూ.25 వేలు విరాళం అందించారు. సోమవారం విరాళానికి సంబంధించిన చెక్కును ఐటిడిఎలోని పిఒ ఛాంబర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి ఈశ్వరరావు, కోశాధికారి అప్పారావులకు పిఒ అందజేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎఒ హేమలత, తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న పిఒ

గిరిజన విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

ఐటిడిఎల వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి - పాడేరు: ప్రభుత్వం, అధికార యంత్రాంగం అలసత్వం వల్లే గిరిజన విద్యాలయాల్లో సమస్యలు తిష్ట వేశాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి మహేష్ అన్నారు. గిరిజన విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని, పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సోమవారం యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాడేరు ఐటిడిఎ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం, అధికారుల అలక్ష్యం వల్ల గిరిజన ఉపాధ్యాయ, విద్యార్థి వర్గాలు సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్, ఎఎన్ఎం, కమాటీ, కుక్‌ల నియామకంలోనూ, సిఆర్‌టిలను రెన్యువల్ చేసి రెగ్యులర్ చేయడంలో తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. భాషా పండిట్లను అప్‌గ్రేడ్, మాతృభాషా వాలంటీర్ల కొనసాగింపులో అధికారులు మీనమేషాలు లెక్కించడం దారుణమన్నారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు డిఇఒ, డివైఇఒ, ఎంఇఒ పోస్టుల్లో ప్రమోషన్లు కల్పించాలని, విద్యార్థుల మెస్ చార్జీలను పెంచడంతోపాటు కాస్మోటిక్స్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ఆశ్రమ పాఠశాలలలో హెల్త్ వాలంటీర్లను నియామకం, ఇతర డిమాండ్లు నెరవేర్చేవరకు దశలవారీ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు టి.చిట్టిబాబు జిల్లా కార్యదర్శులు ఎం.ధర్మారావు, కె.రఘునాథ్ సహాధ్యక్షులు బీటిలి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిఒ 3 కు చట్టబద్దత కల్పించాలని, ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని కోరారు. భాషా వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పాంగి శ్రీను మాట్లాడుతూ భాషా వాలంటీర్ల సమస్యలను పరిష్కరించకుండా ఐటిడిఎ అధికారులు నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు భాషా వాలంటీర్లను పునర్నియామకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏజెన్సీ మండలాల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.దేవుడు, ఎస్ రాంబాబు, ఎస్ కన్నయ్య, పుండరీ, కర్రీ బాబు పాల్గొన్నారు

గిరిజన ఉపాధ్యాయుల సమస్యలపై నిర్లక్ష్యం



ధర్నాలో మాట్లాడుతున్న ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.అరుణకుమారి

చింతూరు : గిరిజన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్‌ఐ) జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.అరుణకుమారి డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఎపి యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చింతూరు ఐటిడిఎ వద్ద నాలుగు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు సోమవారం ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ జిఒ నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని, ఐదేళ్లు పైబడి పని చేస్తున్న సిఆర్‌టిలు, పిఇటిలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 22న విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ ఐటిడిఎ సబ్ కమిటీ కన్వీనర్ ఉర్మ వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ జిల్లా కార్యదర్శి పి.నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పండ కృష్ణయ్య, దొర, నాయకులు ఎ.నాగేశ్వరరావు, బి.ముత్తయ్య, ఎంకే వెంకట్, ఎం.జగదీష్, పి.కన్నారావు, కె.కాంతమ్మ, కె.తులసి, పి.లత, రత్నరావు, సీత, గోపాల్, బ్రహ్మయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం ఐటిడిఎ వద్ద...



మాట్లాడుతున్న ప్రభాకర వర్మ

మారేడుమిల్లి : గిరిజన ఉపాధ్యాయులు, గిరిజన సంక్షేమ హాస్టల్లో ఉన్న సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యాన రంపచోడవరం ఐటిడిఎ ఎదుట సోమవారం ఐటిడీఏ సబ్ కమిటీ కన్వీనర్ కె.ఆదిరెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ వర్మ మాట్లాడుతూ జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించి ఆగిపోయియిన ఉపాధ్యాయుల ప్రమోషన్లు ఇవ్వాలని, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ ఎఎన్ఎంలను నియమించాలని, సిఆర్‌టిలకు బకాయి పడ్డ 12 నెలల జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమశాఖ కమిషనర్‌కు 17 డిమాండ్లతో వినతిపత్రం ఇచ్చామని, కాని నేటికీ వాటిని పరిష్కరించలేదని తెలిపారు. ఇంతటితో ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ, డిప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్ బాబు, కోశాధికారి కె.కృష్ణ, నాయకులు డి.మహేష్, తేజోరావు, కె.సూరిబాబు, సనాతన బాబు, వెంగల రావు, రఘుబాబు దొర, బి.దొరబాబు, ఎల్.మధు రెడ్డి, కె.ఆంధ్రయ్య, పి.శ్రీనివాస్ రావు దొర, డి.పైడిమల్లి, ఎమ్.రమేష్ బాబు 7 మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స

ప్రజాశక్తి- పాడేరు: మాండూస్ తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, రైతుల అప్పులను ప్రభుత్వం మాఫీ చేయాలని అల్లూరి జిల్లా సిపిఎం కమిటీ కార్యదర్శి పి అప్పలనర్స డిమాండ్ చేశారు. గత మూడ్రోజులుగా జిల్లాలో కురిసిన వర్షాలకు 11 మండలాల పరిధిలో 64 గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల కోసిన వరిచేను నీట మునిగినట్టు సమాచారం ఉందన్నారు. ప్రాథమిక అంచనాకు మించి పంట నష్టం ఎక్కువగా వుంటుందని క్షేత్రస్థాయిలో నీట మునిగిన పంటను గుర్తించి, పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. అరకు, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల్లో వరిచేను కుప్పలు తడిసిముద్దయ్యాయని, ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సాంకేతిక అంశాలు చూడకుండా విధిగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుచేసి ప్రకటిత మద్దతు ధరను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట సాగుచేసిన వాస్తవ రైతులను గుర్తించి, ఎకరాకు రూ.30వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు, తొలగింపులు

-ఇఆర్‌ఒలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: ఓటరు నమోదులు, తొలగింపులు, మార్పులు, చేర్పులు పక్కాగా, పారదర్శకంగా చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సహాయ ఎలెక్టోరల్ అధికారుల (తహసిల్దార్లు) ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని తహసిల్దార్లు, సబ్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు అందిన ఓటరు నమోదుకు సంబంధించి ఫారం -6, తొలగింపులకు సంబంధించి ఫారం -7, బదిలీలకు సంబంధించి ఫారం -8లపై క్షేత్ర స్థాయిలో త్వరగా విచారణ జరిపి పరిష్కరించాలని ఆదేశించారు. జూలై నుండి నవంబర్ వరకు అందిన దరఖాస్తులు కూడా పరిష్కరించాలన్నారు. తుది ఓటర్ల జాబితా జనవరి 5న ప్రచురించాల్సి ఉన్నందున పరిష్కార చర్యలు వేగవంతం చేయాలని, ఎట్టి పరిస్తితులలోనూ, సరైన కారణం లేకుండా ధరఖాస్తు తిరస్కరణ, ఓటరు తొలగింపు చేయరాదన్నారు జిల్లాలో 2,771 దరఖాస్తులు (ఫారం 6,7,8 లు) రాగా, 1,950 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పది రోజుల్లోగా పరిశీలించాలని ఆదేశించారు. తరువాత వాటిని డిజిటలైజేషన్ చేయాలన్నారు.

ఈ నెలాఖరుకు ఎలెక్టోరల్ రోల్ అబ్జర్వర్, వచ్చే నెలలో ఎలెక్షన్ కమిషనర్ వచ్చే అవకాశామున్నందున పరిష్కార చర్యలు, ఎటువంటి అపోహలకు తావు లేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. ఈ నెల 22నాటికి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు. ఓటరు విధులలో విఆర్‌ఎలు ఉండరాదని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో శిక్షణ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎన్నికల పర్యవేక్షకులు నాగజ్యోతి పాల్గొన్నారు.

సమగ్ర విచారణ లేకుండానే చర్యలా..?

డిటి, సీనియర్ అసిస్టెంట్లపై సస్పెన్షన్ ఎత్తేయకుంటే మండల బంద్ : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు నేత సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు : పెదబయలు తహశీల్దార్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ నిర్వహించకుండానే అమాయకమైన గిరిజన ఉద్యోగులను బలి చేయడం సరికాదని, తక్షణమే పెదబయలు డిటి, సీనియర్ అసిస్టెంట్ల సస్పెన్షన్‌ను ఎత్తేయకుంటే మండల బంద్ నిర్వహిస్తామని సిఐటియు నేతలు హెచ్చరించారు. సోమవారం యూనియన్ అల్లూరి జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు, మండల కార్యదర్శి కె.సర్బన్న, చెండా రామారావు, రాజు మాట్లాడుతూ, మానసిక ఒత్తిడి వల్లే తన భర్త మృతి చెందారని తహశీల్దార్ భార్య ఆరోపిస్తుండగా, దీనిపై సమగ్ర విచారణకు గిరిజన, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఐటిడిఎ పిఒను రక్షించడం కోసమే కిందిస్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు.

ఇటీవల జిల్లా కలెక్టర్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో పెదబయలు తహశీల్దార్‌ను అందరి సమక్షంలో ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ తీవ్ర పదజాలంతో దూషించడం, మందలించడం వల్లే మనస్థాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయన్నారు. తన సర్వీసులో ఇంతలా దూషణలు ఎదుర్కోలేదని సిబ్బంది ఎదుట తహశీల్దార్ మనోవేదనకు గురైనట్లు విమర్శలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని పక్కదోవ పట్టించేందుకు కింది ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నట్లు కనిపిస్తోందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు.

భూసేకరణను జెసి పరిశీలన



భూములను పరిశీలిస్తున్న జెసి అభిషేక్

ప్రజాశక్తి-హుకుంపేట : 516 నెంబరు జాతీయరహదారి పనుల కోసం మండలంలోని కొట్నాపల్లిలో సేకరించిన భూములను పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ సోమవారం పరిశీలించారు. కొట్నాపల్లిలో రోడ్డు పనులకు 400 ఎకరాల భూమిని సేకరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ రహదారిపనులు చేపట్టేటప్పుడు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని, పనిప్రదేశంలో అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్ఐ రంగారావు, విఆర్ఒ కొండబాబు పాల్గొన్నారు



అర్జీలు స్వీకరిస్తున్న ఐటిడిఎ ఎపిఒ శ్రీనివాసరావు

స్పందనకు 53 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 53 అర్జీలు వచ్చాయి. వీటిని ఐటిడిఎ ఎపిఒ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. వై.రామవరం మండలం చింతలపూడి పంచాయతీలోని చింతకొయ్య నుండి కొత్తాడ గ్రామాల మధ్య కన్నీరు వాగుపై వంతెన నిర్మించాలని, బొడ్డగండి పంచాయితీలోని మంగంపాడు గ్రామ సమీపాన తులసూరు కాలువపై చెక్ డాం నిర్మించాలని, నాగలోవ, అంటిలోవ, రాకోట గ్రామాలలో మినీ అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు చేయాలని వినతులు అందాయి. పాలగడ్డ నుండి బొడ్డగండి వరకు మంజూరైన రహదారిని ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేసి రోడ్డు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు కోరారు. పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన కె.వీరవరం గ్రామంలోని 18 సంవత్సరాల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇంటి ప్యాకేజీ ఇవ్వాలన్నారు. రంపచోడవరం నుండి వై.రామవరం వరకు ఏలేశ్వరం, గోకవరం ఆర్టీసీ డిపోల నుండి బస్సులు ఏర్పాటు చేయాలని, భూపతిపాలెం ప్రాజెక్టు ముంపునకు గురైన కొత్తపాకలు గ్రామస్తులకు భూమికి భూమి, నష్ట పరిహారం, ఐదు గ్రామాల్లో 130 మంది బాధితులకు 360 ఎకరాల పందిగుంట బయలు భూమికి పట్టాలు మంజూరు చేయాలని అర్జీలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజు, ఎండి యూసఫ్, నాగేశ్వరరావు, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, ఎస్ఓ వి.కబోది, ఏడిఎంహెచ్‌వో డాక్టర్ అనూష, పలుశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు సీలేరులో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి -సీలేరు

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్ల భాగ్యలక్ష్మి మంగళవారం జీకే వీధి మండలం సీలేరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఎపి జెన్‌కో సీలేరు ఇన్‌ఛార్జి ఎడిఇగా అప్పలనాయుడు

ప్రజాశక్తి -సీలేరు



జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో డ్యామ్ అండ్ పవర్ హౌస్ ఇన్‌ఛార్జి ఎడిఇగా అప్పలనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డ్యాం అండ్ పవర్ హౌస్ ఏడిఈగా సుధీర్ విధులు నిర్వహించేవారు. ఆయన నెల్లూరు జిల్లా కృష్ణపట్నం ప్రాజెక్టుకు బదిలీ కావడంతో, ప్రస్తుతం క్యాంపు ఏడిఈగా ఉన్న అప్పలనాయుడుకు డ్యాం అండ్ పవర్ హౌస్ ఇన్‌ఛార్జి ఎడిఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ (సివిల్) కెకెవి.ప్రశాంత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉదయం అదనపు బాధ్యతలు చేపట్టారు.

ఆశ్రమ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన

నిందితుడిని కఠినంగా శిక్షించాలని ధర్నా

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని కాకవాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆ పాఠశాల హెచ్‌ఎం భర్త ప్రసాద్‌పై పోక్సో చట్టం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు కూడా నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక ఐటిడిఎ ఎదుట సోమవారం విద్యార్థినుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. వీరికి గిరిజన సంఘం నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న తల్లిదండ్రులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గేట్ ఎదుటే బైఠాయించి ఆందోళన చేపట్టారు. అధికారులతో మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వాలని, ఐటిడిఎ అధికారులు బయటకు రావాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు మాట్లాడుతూ నకిలీ గిరిజనుడైన ప్రసాద్ చేసిన లైంగిక వేధింపులపై పిల్లలు తల్లిదండ్రులతో పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ పాఠశాలలో చోటుచేసుకున్న సంఘటన బయటకు వచ్చినప్పటి నుంచి అధికారులు వారి నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గతంలో గిరిజన, ప్రజా సంఘాల నాయకులు లోపలకు వెళ్తే పిల్లలు తమ యోగక్షేమాలు, వారికి జరుగుతున్న అన్యాయాన్ని చెప్పుకొనే అవకాశం ఉండేది, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఆశ్రమ పాఠశాలల్లోకి ప్రజాసంఘాలకు అనుమతిని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి విడుదల చేసిన జిఒను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పిఎంఆర్‌సి వద్ద ఐటిడిఎ పిఓ సూరజ్ గనోరేను కలిసి వినతిపత్రం అందించారు. దీనికి పిఒ స్పందిస్తూ ఈ సంఘటనపై వెంటనే చర్యలు తీసుకుంటామని, తల్లిదండ్రులు, పిల్లల్ని విచారణ చేస్తామని చెప్పారు. కేసు దర్యాప్తునకు సిడిపిఒ, పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.సిరిమల్లిరెడ్డి, ప్రగతిశీల మహిళ సంఘం జిల్లా నాయకురాలు బి.శ్రీదేవి, జనసేన నాయకులు ఎస్.విద్యా సాగర్ రెడ్డి, బాబీ, టి.శ్రీనివాసు, సిఐటియు జిల్లా నాయకులు కె.శాంతి రాజు తదితరులు పాల్గొన్నారు.



ఐటిడిఎ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు, గిరిజన సంఘం నాయకులు

కెజిబివి భవన నిర్మాణం పూర్తి చేయాలి

ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండల కేంద్రం రేకపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని తక్షణమే పూర్తి చేయాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ పాఠశాలలో భవన నిర్మాణానికి ఆర్‌విఎంఎస్‌ఏ నిధులు 59.64 లక్షలు 2020 సంవత్సరంలో మంజూరు కాగా, నిర్మాణం మొదలు పెట్టి మధ్యలో విడిచిపెట్టిన భవనాన్ని సోమవారం ఆమె స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని, సిపిఎం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఒక వైపు ఈ విద్యా సంవత్సరం నుండి కెజిబివిలో ఇంటర్మీడియట్ తగతులు ప్రారంభించారని, చాలీ చాలని గదులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని మంజూరైన నిధులతో అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు భవనాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, సచివాలయ ఇంజనీరింగు అసిస్టెంట్ కుంజా అరుణ్, పాఠశాల ఎస్ఓ సిబ్బంది పాల్గొన్నారు.



అసంపూర్తిగా నిలిపివేసిన పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి లక్ష్మి, సర్పంచ్ సరోజిని తదితరులు



సీలేరులో కురుస్తున్న మంచు

సీలేరులో దట్టమైన మంచు

ప్రజాశక్తి -సీలేరు

మాండూస్ తుఫాను నేపథ్యంలో వాతావరణం మరింతగా చల్ల బడటంతో మంచు కమ్మేస్తోంది. పగటిపూట మబ్బులతో కూడిన వాతావరణం ఉండగా, రాత్రి అయ్యే సరికి మంచు దట్టంగా కురుస్తోంది. సోమవారం ఉదయం 8 గంటల వరకు సీలేరు పురవీధులు, జెన్‌కో కాలనీ, మెయిన్ బజార్లో దట్టంగా మంచు కురవడంతో ప్రజల అనేక ఇబ్బందులకు గురయ్యారు. వ్యాపారులు 8 గంటల వరకు దుకాణాలు తెరవడానికి సాహసించలేదు. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనవి విధంగా సోమవారం మంచు కమ్ముకోవడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటికి రాలేదు. పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు, వృద్ధులు చలికి తాళలేక అనేక ఇబ్బందులు పడ్డారు. సీలేరు మీదుగా మైదాన ప్రాంతానికి వెళ్లే వాహన సోదకులు మంచు తీవ్రతతో రహదారి కనిపించక వాహనాలు నడిపేందుకు నానా అవస్థలు పడ్డారు.

వరద నష్ట పరిహారం చెల్లించరూ..

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కూనవరం

జులై, ఆగస్టు నెలల్లో సంభవించిన వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన బాధితులకు వరద నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జక్కుల వీరబాబు అధ్యక్షతన జరిగిన సిపిఎం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముంపు ప్రాంత ప్రజలను పరామర్శించడానికి వచ్చిన ముఖ్యమంత్రి రెండు నెలలలో ప్రతి ఇంటికి వరద నష్టపరిహారం ఇస్తానని హామీ ఇచ్చి నేటికీ ఐదు నెలలు గడుస్తున్నా ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా వరద బాధిత ప్రజలను గాలికి వదిలేశారని విమర్శించారు. తక్షణమే పరిహారం చెల్లించకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తాళ్లూరి శ్రీనివాసరావు, శాఖ కార్యదర్శి ఎట్ల వెంకన్న బాబు, ఏడుకొండలు, పసుపులేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న సిఐటియు నేతలు

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -హుకుంపేట: ఈనెల 20.21 తేదీలలో జరిగే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు తామర్ల అప్పలకొండ పడాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహాసభల వాల్‌పోస్టర్లను గిరిజన సంఘం, సిపిఎం నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పలకొండ పడాల్ మాట్లాడుతూ కర్షకులు, కార్మికులు, అన్నివర్గాల ప్రజలు, కార్మికులు పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి లక్ష్మణ్. గిరిజన సంఘం అధ్యక్షులు కాపుల కృష్ణారావు, కార్యదర్శి కిల్లో రామారావు, ఆనంద్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న గిరిజన ప్రాంత విలేకరులు

విలేకరి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - హుకుంపేట: తల్లి చిచ్చిత్తి మరణంతో దిగాలుగాఉన్న మండలంలోని రాప పంచాయతీ లివిటి గ్రామానికి చెందిన విలేకరి చప్పాలి శంకరరావుకు ఏజెన్సీలోని ఎపిటిఅర్ఎ యూనియన్ విలేకర్లు బాసటగా నిలిచారు. సోమవారం లివిటి గ్రామానికి వెళ్లి, తల్లి పోయిన దు:ఖంలో ఉన్న శంకరరావును పరామర్శించారు. రూ.ఐదు వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కొర్ర ఆనంద్, పాంగి లింగమూర్తి మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న విలేకర్లకు యూనియన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి లకే ఉదయ్ కుమార్. ఉపాధ్యక్షులు మీసాల నాగరాజు, కనకరాజు పాల్గొన్నారు



వ్యాపారులతో మాట్లాడుతున్న మార్కెట్ యార్డు చైర్మన్, సర్పంచ్

నిర్ణయించిన ధరలకే కూరగాయలు అమ్మాలి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: అరకులోయ మార్కెట్ యార్డులో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారస్తులు కచ్చితంగా ప్రభుత్వం ప్రకటించిన ధరల ధరలకు అనుగుణంగా విక్రయించాలని అరకు నియోజకవర్గ మార్కెట్ కమిటీ చైర్మన్ కె రాజారమేష్, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మార్కెట్ యార్డులోని వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. కూరగాయలధరల పట్టికను ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, త్రినాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా కలప రవాణా

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి డుంబ్రిగూడ : అధికారుల కళ్లుగప్పి, అక్రమ పర్మిట్లతో మండలంలో పలు గ్రామాల నుంచి కలపను అక్రమంగా విచ్చలవిడిగా తరలించుకుపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నారు. కలప కటింగ్, తరలింపునకు సంబంధించి నిబంధనలకు తూట్లు పొడుస్తూ, యథేచ్ఛగా ఈ అక్రమం సాగిపోతున్నా సంబంధిత అటవిశాఖ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం.

జిరాయితీ, ఇతర ఏ భూమిలోనైనా రైతులు వేసిన కలపను నరికి, తరలించాలంటే ప్రభుత్వపరంగా మార్గదర్శకాలున్నాయి. ముందుగా కలప తోటున్న స్థలానికి సంబంధించి, పొజిషన్, ఫీజిబిలిటీలను రెవెన్యూ అధికారుల నుంచి పొందిన, తర్వాత కొన్ని రకాల కలపలకు అటవీ అధికారుల నుంచి కటింట్ పర్మిషన్లు తీసుకోవాల్సి ఉంది. కటింగ్అయ్యాక సంబంధిత దుంగలను అటవీ అధికారులు పరిశీలించి, వాటికి నెంబర్లు వేసి రవాణాకు పర్మిట్లు ఇస్తారు. అదే మామూలు కలప అయితే పట్టా భూముల్లో పెంచిన తోటలే అయినప్పటికీ అటవీశాఖ రవాణా పర్మిట్లు తీసుకోవాల్సి ఉంది. నిబంధనల ప్రకారం ఇంత తంతు ఉండగా, అలాగే ఒకటి రెండు లోడులకు పర్మిట్లు పొందిన అక్రమార్కులు, అదే పర్మిట్లతో అనేక లోడుల కలపను యథేచ్ఛగా తరలిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అరకు పాడేరు ప్రధాన రోడ్డు కిరువైపులా నున్న పట్టా భూముల్లో నుంచి కలపను లారీల్లో లోడ్ చేస్తూ తరలిస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకే పర్మిట్ మీద ఒకటి కంటే ఎక్కువ లోడులు తీసుకుపోతున్నాయన్న ఆరోపణలపై అధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ట్రాక్టర్లలో తరలిస్తున్న కలప దుంగలు

30న పాడేరులో ఆదివాసీ గర్జన సభ

గిరిజన హక్కుల పరిరక్షణకు 23 వరకు జీపు యాత్ర



జీపుయాత్రను ప్రారంభిస్తున్న జెఎసి నేతలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజనుల హక్కుల పరిరక్షణకు చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఆదివాసీ ఉద్యమ జెఎసి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు గిరిజన భవన్ నుంచి ఆదివాసి హక్కుల పరిరక్షణ యాత్ర ప్రారంభమైంది. యాత్రను ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు మధుకర్ ఉయికే, నెహ్రూ, నాయకులు ముఖి శేషాద్రి, బోయపల్లి సింహాచలం, రొబ్బ నాగభూషణ్ రాజు, పలాసి కష్టారావు, గంగరాజు, రేగం సూర్యనారాయణ, సోమెల సింహాచలం, సంజీవరావు, సూర్య నారాయణ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలోని 11 మండలాల్లో యాత్ర కొనసాగుతుందని, అనంతగిరి నుండి మొట్టడం రాజుబాబు నాయకత్వంలో, కొయ్యూరు నుండి రామారావుదొర నాయకత్వంలో జీపుయాత్ర కొనసాగి, ఈ నెల 23న పాడేరు చేరుకుంటుందన్నారు. 30న ఆదివాసీ గర్జన పేరుతో పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వంతాల రామారావు, బుచ్చేశ్వరరావు, ఆదినారాయణ పడాల్, వి.కొండలరావు, బుడిదె సమన్, మాధవరావు, నానిబాబు పాల్గొన్నారు.

విజ్ఞాన సముపార్జనకు విహారయాత్ర

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విజ్ఞాన సముపార్జనకు గిరిజన విద్యార్థులను శ్రీహరికోట విహారయాత్రకు తీసుకెళుతున్నట్టు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం ఐటిడిఎ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా ప్రభుత్వ పాఠశాలల గిరిజన విద్యార్థులు తొలిసారిగా బయలుదేరి వెళ్లిన విజ్ఞాన విహారయాత్రల బస్సులను యాత్రను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, నేలపట్టు పక్షి సంరక్షణ కేంద్రానికి విజ్ఞాన యాత్రకు వెళుతున్న విద్యార్థులకు శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ఐటిడిఎ చరిత్రలోనే మొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను శ్రీహరికోట విజ్ఞానయాత్రకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. ఇలాంటి విజ్ఞానయాత్రల్లో కొత్త ప్రదేశాల సందర్శన ద్వారా కొత్త విషయాలు నేర్చుకునే వీలుంటుందన్నారు. పిల్లలంతాఉపాధ్యాయుల సూచనలను పాటించి, విజయవంతంగా యాత్ర ముగించుకుని రావాలని ఆకాంక్షించారు.



యాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ఫాల్గుణ

తప్పిన భారీ ప్రమాదం

- వారపు సంత స్థలంలో కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి -అనంతగిరి : మాండూస్ తుఫాన్ ప్రభావంతో అనంతగిరి వారపుసంత స్థలంలో, అరకు మెయిన్‌రోడ్డులో భారీ వృక్షం సోమవారం వేకువజామున కూలింది. పగటిపూట అయితే జన సంచారం ఉండే ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలు, మనుషులెవరూ లేని సమయంలో భారీ శబ్దంతో ఈ మామిడిచెట్టు కూలిపోయింది. అక్కడే ఉన్న 11కెవి విద్యుత్ వైర్లపై పడడంతో అవి తెగిపడ్డాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై విద్యుత్ సరఫరా ఆపేశారు. కూలిన సమయంలో పెద్దశబ్దం రావడంతో సమీప ట్రాన్స్‌ఫార్మర్ వీధి, వైఎస్సార్ కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యార. అయితే ఎవరూ లేని సమయంలో భారీ వృక్షం కూలిపోవడంతో పెద్ద ప్రమాదం, ప్రాణనష్టం తప్పినట్టేనని స్థానికులు అంటున్నారు.

జెడ్‌పిటిసి చొరవతో చెట్టు కొమ్మల తొలగింపు

అరకు రోడ్డులో భారీ వృక్షం కూలిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజు హుటాహుటిన అక్కడకు చేరుకుని, రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలను అప్రమత్తం చేసి, స్థానికుల సాయంతో చెట్టు కొమ్మలకు తొలగించే చర్యలు చేపట్టారు. విశాఖ, ఎస్.కోట, ఇతర మైదానప్రాంతాలకు వెళ్లే బస్సులు,ఇతర వాహనాలు రాకపోకలకు ఇబ్బందులేర్పడడంతో వాటిని దారి మళ్లించారు. మధ్యాహ్నానికి చెట్టుకొమ్మలను తొలగించి, ఇదే మార్గంలో రాకపోకలను పునరుద్ధరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్. నాగులు వార్డు సభ్యుడు జె.సుబ్బారావు, ఉప సర్పంచ్ పి అర్జున్, విఆర్ఒ రాజేశ్వరి, విఆర్ఎ లింగమూర్తి. ఎఎస్ఐ రాజమనాయుడు, కానిస్టేబుల్ లోవరాజు ఉన్నారు.

పనిభారం తగ్గించండి

ప్రజాశక్తి- అనంతగిరి : సమగ్ర భూరీసర్వేలో విఆర్ఒలకు పని ఒత్తిడిని తగ్గించాలని అనంతగిరి మండల విఆర్ఒల యూనియన్ అధ్యక్షుడు పట్టాసిరామన్న కోరారు. ఈ మేరకు విఆర్ఒలంతా సోమవారం డిటి పాత్రుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ, ఉదయం 8 గంటలకే రీసర్వేకు వెళ్లి, సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉండి, తర్వాత దీనికి సంబంధించిన రికార్డు పనులను మరో గంట చేయాల్సి వస్తోందని,దీంతోపాటు సర్టిఫికెట్లు, మ్యుటేషన్లు, ఇతర పనులు ఉండనే ఉన్నాయన్నారు. దీనికి తోడు ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సవరణ ఇతర పనులు చేయాల్సి వస్తోందన్నారు ఇలా తీరికలేకుండా చేస్తున్న పనిఒత్తిడి వల్ల శ్రీకాకుళంలో విఆర్ఒ, పెదబయలు తహశీల్దార్ ఆత్మహత్య చేసుకున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో విఆర్ఒలకు పనిఒత్తిడి తగ్గించాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.



విచారణ చేస్తున్న ఇఒపిఆర్‌డి రాజ్‌కుమార్

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : పంచాయతీ నిధులు దుర్వినియోగంపై ఉపసర్పంచ్ భగత్ రామ్, కొందరు వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు సోమవారం ఇఒపిఆర్‌డి రాజ్‌కుమార్ విచారణ చేపట్టారు, ఫిర్యాదుదారులతో పాటు సర్పంచ్ సుస్మితను విచారించి, వారి నుంచి రాతపూర్వకంగా వివరాలను నమోదు చేసుకున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తానని, కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడించారు.

పంచాయితీ సెక్రటరీ, సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

పంచాయతీ నిధులతో పనులు చేయకుండా రికార్డులు చూపించి నిధులు దుర్వినియోగం చేసిన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని ఉపసర్పంచ్ భగత్ రామ్ డిమాండ్ చేశారు. పంచాయతీ పాలకమండలి తీర్మానం, వార్డు సభ్యుల దృష్టిలో పెట్టకుండా సర్పంచ్ ఏకపక్షంగా నిధులను దుర్వినియోగం చేశారన్నారు. దీనికి సహకరించిన పంచాయతీ కార్యదర్శితోపాటు సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇఒపిఆర్‌డి తూతూమంత్రంగా విచారణ జరిపి వెళ్లారని, దీనిపై చర్యలు లేకుంటే మరోమారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



అప్పారావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి - సీలేరు : ఏపీఈపీడీసీఎల్‌లో డీఈఈగా పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సీలేరు పూర్వ విద్యార్థుల సంఘం (సోసా) వ్యవస్థాపక అధ్యక్షుడు వి.అప్పారావును సోమవారం పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సోసా కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ సీలేరు జెడ్పీ పాఠశాలలో 40 సంవత్సరాలు క్రితం నుంచి చదువుకున్న వారి వివరాలు సేకరించి వారితో అసోసియేషన్ ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు అప్పారావు చేతులు మీదుగా చేయాలనే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. ఉపాధ్యక్షుడు ఎన్ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణ నుంచి విశ్రాంతి తీసుకుంటున్న అప్పారావు ఇకపై పూర్తిగా పాఠశాల అభివృద్ధికి సమయం కేటాయించాలని కోరారు. జాన్‌విలియం, యాకోబు, కామేశ్వరరావు, నక్కా బాల, బొర్రాకృష్ణ, కారే శ్రీనివాసు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సహకారంతో మంచి ఫలితాలు

ప్రజాశక్తి-పెదబయలు : పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలంటే వారి తల్లిదండ్రుల సహకారం అవసరమని స్థానిక బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ డిఎస్ శంకరరావు అన్నారు. సోమవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పదోతరగతిలో మంచి ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను చదివిస్తున్నామని, పబ్లిక్ పరీక్షలకు ముందున్న ఈ మూడు నెలలు ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రతాప్ పాల్గొన్నారు.

రాజ్‌మా రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: ప్రస్తుతం కురుస్తున్న మంచు, వర్షాల కారణంగా రాజ్మా పంటను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని స్థానిక గిరిజన సంఘం మండల నాయకులు వి అచ్యుత్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాండూస్ తుపాన్ కారణంగా తూటంగి పంచాయతీలో వందలాది ఎకరాల రాజ్‌మా పంటలు నీట మునిగాయన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ముంచంగిపుట్టు : మండల కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని తహశీల్దార్ నర్సమ్మ, ఎంపిడిఒ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి, ఆపదలో ఉన్నవారికి ముఖ్యంగా సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న వారి ప్రాణాలను నిలిపేందుకు రక్తం ఎంతో అవసరమని, రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడినవారవుతారని అన్నారు. రక్తదాతలకు గంగరాజుతోపాటు ఎంపిడిఒ, తహశీల్దార్ అభినందనలు తెలిపారు.

వైసిపి నుంచి 51 కుటుంబాలు

సిపిఎం ప్రజా సంఘాల్లో చేరిక

ప్రజాశక్తి - చింతూరు.

చింతూరు మండలం కల్లేరు పంచాయతీ పరిధిలోని స్థాపర్లపేట గ్రామానికి చెందిన 51 కుటుంబాలు వైసీపీ నుండి సిపిఎం ప్రజా సంఘాల్లో చేరాయి. సిపిఎం చేస్తున్న ప్రజా సమస్యలపై పోరాటాలు చూసి తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి సీరం సురేష్, జిల్లా నాయకులు పల్లపు వెంకట్, యర్రంశెట్టి శ్రీనివాస్, పులి సంతోష్, కారం సుబ్బారావు, లక్ష్మణ్, భీమయ్య తదితరులు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



సిపిఎం ప్రజా సంఘాల్లో చేరిన వారితో కిరణ్, తదితరులు

పిపిపిలకే స'పోర్టు'..!

శరవేగంగా పలు ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు
పోర్టు ఆసుపత్రి సాధ్యతపైనా అధ్యయనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన విశాఖ పోర్టులో బెర్తుల ప్రైవేటీకరణ ఊపందుకుంటోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి)కు సంబంధించిన ప్రాజెక్టులకు శరవేగంగా క్లియరెన్సులు వచ్చేస్తున్నాయి. పిపిపి విధానంలో దేశంలోని 13 మేజర్ పోర్టులనూ కేంద్రం ప్రైవేటుపరం చేసేందుకు తీవ్ర యత్నాల్లో నిమగ్నమైన సంగతి తెలిసిందే. అంతకంతకూ విశాఖలో బెర్తులన్నీ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహించేలా పోర్టు అధికారులపై కేంద్రం ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. నిర్వహణ భారాన్ని తక్కువగా మోయడం ద్వారా అత్యధికంగా లబ్ధిపొందాలన్న భావనతో పోర్టులకు కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను జారీచేయడంతో ఆ దిశలో 'ల్యాండ్ లార్డ్' పోర్టు ప్రయాణం చేస్తోంది. తాజాగా పిపిపిలో కైలాసపురం వద్ద 5.8 ఎకరాల్లోగల పోర్టు ఆసుపత్రి నడుస్తోంది. దీన్ని రూ.250 కోట్లు నుంచి రూ.300 కోట్లకు పిపిపి కింద ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. టెండర్ల కోసం పోర్టు ఎదురుచూస్తోంది. దీనిపై ఫీజిబిలిటీ స్టడీ (సాధ్యతల అధ్యయనం) జరుగుతున్నట్లు పోర్టు అధికారుల ద్వారా వెల్లడవుతోంది. పిపిపి కోసం ఈక్యూ -7, డబ్ల్యూ క్యూ 7, 8, ఈక్యూ 6 బెర్తులకు సంబంధించిన టెండర్లన్నీ దాదాపు పూర్తయిపోయాయి. సుమారు రూ.68 కోట్లకు ఈ బెర్తులను ప్రైవేట్‌కు ఇచ్చేందుకుగానూ కేంద్రం నుంచి అనుమతులు వచ్చాయి. టెండర్లు కూడా పూర్తికావడంతో ఈ బెర్తులకు సంబంధించి పోర్టు సెక్యూరిటీ క్లియరెన్స్ కోసం ఎదురుచూస్తోంది. వైజాగ్ పోర్టులోని 21 బెర్తుల్లో సగానికిపైగా పిపిపి కిందనే నడుస్తున్నాయి. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేల సంఖ్యలో ఇండైరెక్ట్ ఉద్యోగులూ విధులు నిర్వర్తిస్తున్నారు.

ఈక్యూ 1 అదానీ బెర్త్ స్వాధీనం...
పోర్టుకు రూ.30 కోట్లకుపైగా లాభం

ఈ కాలంలో వైజాగ్ పోర్టులో చెప్పుకోదగ్గ విషయానికొస్తే.. 2011 నుంచీ అదానీ ఆధీనంలోగల ఈక్యూ -1 బెర్తును విశాఖ పోర్టు ఈ ఏడాది మేలో స్వాధీన పరచుకున్న సంగతి తెలిసిందే. ఈ బెర్తుపై అప్పట్లో లోడింగ్ టెస్టులు నిర్వహించారు. తాజాగా ఆపరేషన్స్‌లోకి వచ్చింది. గడచిన నాలుగు నెలల్లో రూ.30 కోట్లకు పైగానే ఈ బెర్తుపై పోర్టు లావాదేవీలు నెరపి ఆదాయం సంపాదించింది.

అదానీ బెర్తులో ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఒఅండ్ఎం) ద్వారా ఒక ఏడాదికి టెండర్లను పిలవడం ద్వారా కార్గో హేండ్లింగ్ ఛార్జీలను పోర్టు సాధించింది. అదానీ నుంచి హేండోవర్ చేసుకున్నాక పలు రకాల వెస్సెల్ రిలేటెడ్ ఛార్జీల రూపంలోనూ పోర్టు అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

పన్ను వసూలు బాధ్యత మాకొద్దు బాబోయ్..!

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చెత్త పన్ను, యూజర్ ఛార్జీల వసూలు బాధ్యత నుంచి తమను తప్పించాలని, లక్ష్యాలు విధిస్తూ మానసిక ఒత్తిడికి గురి చేయడం భావ్యం కాదని జివిఎంసి వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు నిరసన తెలిపారు. స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి కావాతి పీటర్ మీడియాతో మాట్లాడుతూ చెత్త పన్ను వసూలు విషయంలో జోన్ 4 అధికారులు తీవ్రమైన పని ఒత్తిడి చేయడంతో కార్యదర్శి బాకూరి చంద్రమోహన్ తట్టుకోలేక మరణించారని చెప్పారు. దీంతో ఆయన కుటుంబం వీధిన పడిందన్నారు. అతని కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలన్నారు. అతని కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకంలో ఉద్యోగం కల్పించాలన్నారు. చంద్రమోహన్ మృతికి కారకులైన జోన్ 4 కమిషనర్ చక్రవర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నారావులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. చెత్త పన్నును ఆస్తి పన్ను, నీటి పన్నులలో విలీనం చేసి వసూలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జంగం అహర్నిశ, ఆడారి శివ, అడిగర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరెడ్డి భౌతికకాయం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నేతలు

సిపిఎం కార్యకర్త వెంకటేశ్వరరెడ్డి మృతి

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని కోటారుగొమ్ము గ్రామానికీ చెందిన సిపిఎం సీనియర్ కార్యకర్త కటకల వెంకటేశ్వర రెడ్డి (67) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తుది శ్వాస విడిచారు. మృతుడు వెంకటేశ్వర రెడ్డికి కూతుర్లు నాగమణి, పండమ్మ, కుమారుడు ప్రతాప్ రెడ్డి ఉన్నారు. మరణ వార్త తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, పలువురు నాయకులు వెంకటేశ్వరరెడ్డి భౌతిక కాయాన్ని ఎర్రజెండాను కప్పి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో వల్ల కృష్ణారెడ్డి, శాఖా కార్యదర్శి వినోద్ రెడ్డి, నాయకులు బొజ్జి రెడ్డి, అంజి రెడ్డి, శ్రీరాములు రెడ్డి, జామా రెడ్డి, రమాదేవి, వరలక్ష్మి, ప్రసాద రెడ్డి తదితరులు పాల్గన్నారు.



విశాఖ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో..

16 వేల దొంగ ఓట్లు : అయ్యన్న ఆరోపణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో 16 వేల వరకు దొంగ ఓట్లు నమోదయ్యాయని, విచారణ జరిపి తక్షణం తొలగించాలని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో 3, 5, 10, ఇంటర్, ఆఖరికి నిరక్షరాస్యులు కూడా ఓటర్లుగా నమోదయ్యారన్నారు. కొంతమంది పేర్లు రెండు, మూడు సార్లు వచ్చాయన్నారు. కేవలం ఉత్తరాంధ్రలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల వరకు ఇటువంటి తప్పుడు ఓట్లు నమోదు కాబడ్డాయన్నారు. గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా ఇటువంటి తప్పుడు ఓట్లు నమోదు చేశారని ఆరోపించారు. అలాంటి వ్యవస్థను తెచ్చింది దీనికేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త విజయబాబు, పాశర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మాధవ్ ఫిర్యాదు

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో అనర్హులు ఉన్నారంటూ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతోపాటు పాత నగరంలో పప్పుల చిట్టీల పేరుతో 14 వేల మందిని మోసగించి పరారైన నైన్ స్టార్ కంపెనీ నిర్వాకుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు.